క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామంలో బీబీ ఫాతెమా జహేరా దర్గా వద్ద రూ.మూడు లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు తోరం భాస్కర్, కొనుకు నాగరాజు, మొల్లేటి త్రిమూర్తులు, చిక్కం బుజ్జిబాబు, తోలేటి ఆదినారాయణమూర్తి, బొరుసు చిట్టిబాబు, చిక్కం ప్రసాద్, అడబాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పగలు ఎండ.. రాత్రి మంచు

అంబాజీపేట: వాతావరణంలో విభిన్న మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగటి పూట వేసవిని తలపించేలా ఎండలు మండిపోతుంటే.. రాత్రులు మంచు కురుస్తుండటంతో అనారోగ్యానికి గురైన వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి 8 గంటల నుంచే మంచు కురుస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోతుంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరగడంతో పాటు ఉక్కబోత అధికంగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేక చాలా మంది ఇళ్లకే పరిమితమైపోతున్నారు. చిరు వ్యాపారుల వద్ద ఉన్న పండ్లు ఎండకు పాడైపోయి నష్టాల పాలవుతున్నారు. వర్షాకాలం వెళ్లి... శీతాకాలం వచ్చినా రోహిణి కార్తెలో ఎండల్లా ఇప్పుడు ఉన్నాయంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు జన సంచారం లేక ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి.

ఫూలే-అంబేడ్కర్ భవనానికి ఇన్వర్టర్ బహూకరణ



తులసీభాస్కర్‌కు ఇన్వర్టర్ అందిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ సతీష్

మలికిపురం: స్థానిక సెంటర్లో ఉన్న ఫూలే-అంబేడ్కర్ భవనానికి మండల విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ ఇన్వర్టర్ బహూకరించారు. ఫూలే-అంబేడ్కర్ భవనంలో బహుజన సమన్వయ కమిటీ అధ్యక్షుడు గెడ్డం తులసీ భాస్కరరావుకి శనివారం అందజేశారు. అలాగే త్వరలో రెండు ఏసీలు కూడా బహూకరిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తాడి సహదేవ్, విద్యార్థి సంఘ నాయకుడు రాపాక మహేష్ పాల్గొన్నారు.

పరిహారంపై 17న రైతులతో సమావేశం

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెంలో ఈ నెల 17న స్థానిక రైతులతో గ్యాస్ పైపులైన్లు వేసిన సందర్భంలో ఓఎన్జీసీ ఇవ్వాల్సిన నష్టపరిహారంపై ఒక సమావేశం నిర్వహిస్తున్నట్టు సంస్థ వర్క్స్ ఇన్‌చార్జ్ జి.శ్రీనివాస్, మోరి జీసీఎస్ షిఫ్ట్ ఇన్‌చార్జ్ జీవీ ఆదిత్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నష్టపరిహారంపై రైతులు ఆందోళన నేపథ్యంలో వారు ఈ ప్రకటనను రైతులకు దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో రైతుల పొలాల్లో సంస్థ ఇటీవల కేవీ 5, 15, 17, 27, 29 బావులకు చెందిన ఐదు పైపులైన్లు కొత్తగా వేసిందన్నారు. దీని నిమిత్తం సంస్థకు చెందిన జీఎం (హెచ్‌ఆర్) డి.కిషోర్ కుమార్, డీటీ కృష్ణప్రసాద్ గ్రామంలో రైతులతో ఈ నెల 17న ఒక సమావేశం నిర్వహించి, వారికి తగిన రీతిలో నష్టపరిహారం ఇచ్చేందుకు చర్చిస్తారన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నగరం ఎస్సై పి.సురేష్ సూచించారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ఏర్పాటు చేసిన ఫెస్ట్ కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన ప్రముఖులను సన్మానించారు. నగరం ఎస్సై సురేష్, ప్రముఖ డాక్టర్లు కడలి సత్యనారాయణ, కె.సీతారామారావు, రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రరావు, మాజీ సర్పంచ్ వాకపల్లి మంగయ్యలకు షీల్డులు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాన్ని సాధించే దిశగా కష్టపడి చదువుకోవాలని సూచించారు. కళాశాల అధ్యాపకుడు అడబాల విజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లిపాలెంలో ఫ్రెండ్లీ టీచర్స్ క్రికెట్ టోర్నీ

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెం ఆశ్రమ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో శనివారం దసరా ఫెస్టివల్ పురస్కరించుకుని ఫ్రెండ్లీ టీచర్స్ ఒక రోజు క్రికెట్ టోర్నీ జరిగింది. మండలంలోని హైస్కూల్స్ టీచర్స్ టీం, ప్రైమరీ స్కూల్ టీచర్స్ టీంల మధ్య పై టోర్నీ నిర్వహించారు. టోర్నీలో ప్రైమరీ స్కూల్ టీచర్స్ టీం, హైస్కూల్ టీచర్స్ టీంపై గెలుపొందింది. గెలుపొందిన టీంకు ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు టోర్నీ అందజేశారు. అలాగే టోర్నీలో బెస్ట్ బౌలర్ గా ఎస్టీటీ టీంకు చెందిన గిరిబాబు, సతీష్ కుమార్ అవార్డులను అందుకున్నారు. రన్నర్స్‌కు కూడా అవార్డు అందజేశారు. ఎస్టీయూ, యూటీఎఫ్, పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ సంఘ నాయకులు, టీచర్లు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు ఆలయాలు సిద్ధం

- నేటి నుంచి దసరా ఉత్సవాలు
- అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారి ఆలయంలో దేవీ నవరాత్ర మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఆదివారం ఉదయం యాతం వెంకట నారాయణరావు, ఆదిలక్ష్మి దంపతులతో కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. రోజూ ఉదయం అమ్మవారికి సహస్ర నామ పూజలు జరుగుతాయన్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి అలంకరణలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు భక్తులకు దాతల సాయంతో పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. 20న వేలాది మంది విద్యార్థులతో సరస్వతీ దేవి పూజ నిర్వహిస్తామన్నారు. నవరాత్ర మహోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. పి.గన్నవరంలోని లక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో దేవీ నవరాత్ర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను సిద్ధం చేశారు. ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకూ దేవీ శర్నవరాత్రులు నిర్వహించేందుకు ఆలయాలను సిద్ధం చేస్తున్నారు. కనకదుర్గ అమ్మవారి ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాలంకారణ, చలువ పందిళ్లతో ఏర్పాట్లు చేశారు.



అంబాజీపేట సంతమార్కెట్‌లో అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న భక్తులు



తాటికాయల వారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ



అప్పనపల్లి పద్మావతీదేవి



పాశర్లపూడిబాడవలో కొలువుదీరిన కనకదుర్గమ్మ

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల, పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద సందడి నెలకొంది. అంబాజీపేట శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే విజయ భేతాళ ఉత్సవాలకు సంబంధించి మాచవరం దుర్గా క్షేత్రం రామ్‌ఘాట్ నుంచి కలశను మేళతాళాలు, యువకులు కేరింతల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చేందుకు 13 పాలాలకు చెందినవారు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం పెద్దవీధిలో ఉన్న శ్రీనివాస నగర్‌లో వేంచేసియున్న భేతాళస్వామి ఆలయంలో నెలకొల్పనున్నారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధం

మామిడికుదురు: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 15వ తేదీ ఆదివారం నుంచి 25వ తేదీ బుధవారం వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కనకదుర్గమ్మ ఆలయాల వద్ద పందిళ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మండలంలోని పెదపట్నంలంక, పాశర్లపూడిబాడవ, మగటపల్లి, మామిడికుదురు, బి.దొడ్డవరం, అప్పనపల్లి, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో లక్ష కుంకుమార్చన, శతచండీయాగం, తదితర ప్రత్యేక పూజలతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అప్పనపల్లిలో..

అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో కొలువుదీరిన పద్మావతీ దేవి సన్నిధిలో ఆదివారం నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ జి.శ్రీదేవి తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు దేవీ నవరాత్ర ఉత్సవాలకు కలశ స్థాపన జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా తొమ్మిది రోజుల పాటు అమ్మ వారి సన్నిధిలో పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశామని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల అర్హత



గుబ్బల బిందు



కడలి మధుశ్రీ



మాదాసు నాగచైతన్య

రాజోలు: పొన్నమండ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు గుబ్బల బిందు, కడలి మధుశ్రీలు, అలాగే చింతలపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి మాదాసు నాగచైతన్య రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎంలు ఆరుమిల్లి రోహిణి, దొంగ జానకిరామయ్యలు తెలిపారు. విద్యార్థులను కోచ్‌లు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.

నల్లతాచు హల్‌చల్

అంబాజీపేట: గత ఐదు రోజులుగా ఓ ఇంటి ప్రాంగణంలో నల్ల తాచుపాము హల్‌చేస్తూ భయభ్రాంతులకు గురిచేసింది. అంబాజీపేట శివారు స్త్రీల ఆస్పత్రిలో సమీపాన దొమ్మేటివారి పాలెంలో దొమ్మేటి బాలసందీప్ (బాలు) ఇంటి వద్ద నల్లతాచుపాము గత ఐదు రోజుల నుంచి తిరుగుతుంది. ఆ తాచుపామును పట్టించేందుకు స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. బాలు ఇంటి గుమ్మంలో ఉన్న తాచుపామును పట్టుకుని బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. నల్లతాచును జనసంచారం లేని ప్రాంతంలో వదిలిపెడతానని వర్మ తెలిపారు.

సుభిక్ష పాలనతో సంక్షేమ వెల్లువ

రాజోలు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష పాలనతో సంక్షేమం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం శివకోడులో ఎమ్మెల్యే రాపాక గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలు అందుకున్న సంక్షేమ లబ్ధిని ఎమ్మెల్యే రాపాక వివరించారు. మహిళలు, వృద్ధులు సీఎం జగన్‌పై ఉన్న అభిమానాన్ని ఎమ్మెల్యే రాపాక వద్ద ఎంతో సంతోషంగా వెలిబుచ్చారు. నెలానెలా పింఛన్ వలంటీర్ ఇంటికి తీసుకువచ్చి ఇవ్వడంపై పలువురు వృద్ధులు ఎంతో ఆనందాన్ని వ్యక్తపర్చారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ గతంలో పింఛన్ తీసుకోవాలంటే పంచాయతీ వద్దకు వచ్చి గంటలు తరబడి వేచి ఉండాల్సి వచ్చేదని, ఈలోగా అనేక సమస్యలు వృద్ధులు, వికలాంగులు ఎదుర్కొనే వారన్నారు. వాటి అన్నింటికి స్వస్తి పలికి వలంటీర్ వ్యవస్థతో పింఛన్ పంపిణీ విధానం పూర్తిగా మారిపోయిందన్నారు. సెలవు రోజులతో నిమిత్తం లేకుండా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా కచ్చితంగా ఒకటో తేదీ తెల్లవారకముందే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ అందుకుంటున్నారన్నారు. ఇలాంటి సంక్షేమ దృష్టి గల ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆయనను మళ్లీ సీఎంగా విజయం వైపు నడిపించాలని కోరారు. ఎమ్మెల్యే రాపాక తనయుడు రాపాక వెంకట్‌రామ్, సర్పంచ్ నక్కా రామారావు, రాజోలు సొసైటీ చైర్మన్ కూనపరెడ్డి రాంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ కసుకుర్తి రామకృష్ణ, పితాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శివకోడులో మహిళకు బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పి.గన్నవరం: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరం శ్రీభువనేశ్వరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని 488 మంది సభ్యులకు షేరు ధనంపై రూ.8,84,310ల వడ్డీ రాయితీని చిట్టిబాబు శనివారం పంపిణీ చేశారు. సహకార సంఘ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. సంఘ అభివృద్ధికి పాటుపడుతున్న చైర్మన్ ఆనంద్‌ను, సిబ్బందిని ఆయన అభినందించారు. సంఘ టర్నోవర్‌ను రూ.3.5 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచారని చిట్టిబాబు వివరించారు. స్వయం ఉపాధి పథకంలో భాగంగా పలువురు రైతులకు గేదెలను అందజేశారు. సహకార విద్యాధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు, ఆప్కాబ్ సీనియర్ మేనేజర్ బాపూజీ, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ వరప్రసాద్, సంఘ కార్యదర్శి కటికిరెడ్డి సోమేశ్వరరావు, బ్యాంకు సూపర్‌వైజర్ బ్రహ్మాజీ, త్రీమెన్ కమిటీ సభ్యులు చిట్టాల వెంకన్న, పెచ్చెట్టి స్రవంతి, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో సొసైటీ సభ్యులకు షేరు ధనంపై వడ్డీ రాయితీని అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

విజ్ఞానం, సంస్కారం అందించే ఆయుధం విద్య



ప్రతిభ చాటిన మందపల్లి పాఠశాల విద్యార్థులతో ఫౌండేషన్ సలహాదారు మూర్తి, ఉపాధ్యాయులు

కొత్తపేట: విజ్ఞానంతో పాటు వ్యక్తుల జీవితాన్ని మార్చి సంస్కారాన్ని అందించే శక్తివంతమైన ఆయుధం విద్య అని రాజ్‌కమల్ ఫౌండేషన్ గౌరవ సలహాదారు, గణిత అవధాని టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి అన్నారు. కొత్తపేట శివారు ఏనుగుల మహల్‌కి చెందిన వారణాసి శ్రీరామచంద్రమూర్తి జ్ఞాపకార్థం ఆయన అల్లుడు యూఎస్ఏకి చెందిన యర్రమిల్లి జయరామ్ రాజ్‌కమల్ ఫౌండేషన్ స్థాపించి పేద విద్యార్థులకు ఆర్థికపరమైన సేవలు అందిస్తున్నారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మందపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలో ఏడుగురు బాలికలు, ఐదుగురు బాలురు ప్రతిభను కనబరిచారు. వారికి ఫౌండేషన్ తరఫున పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేసి ఏటా కొంత నగదు ఇచ్చే ఏర్పాటు చేశారు. ఆ అకౌంట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అదివారపుపేట వెంకటేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.సువర్ణ, ఉపాధ్యాయులు వై.రమణ, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడు బోధించిన పంచశీలను పాటిద్దాం



ధమ్మ దీక్షా ఉత్సవంలో మాట్లాడుతున్న పూజ్యభంతే నాగభూషణ్ కొండయ్య

మామిడికుదురు: తథాగత భగవాన్ బుద్ధుడు బోధించిన పంచశీలను పాటించడం ద్వారా మంచి భారతీయులుగా జీవిద్దామంటూ పూజ్యభంతే నాగభూషణ్ కొండయ్య ఉద్బోధించారు. ఆదుర్రులో శనివారం 67వ ధమ్మ దీక్ష ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించి 67 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదుర్రు సెంటర్‌లో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెండి ప్రతాప్ కుమార్ పంచశీల పతాకాన్ని ఆవిష్కరించారు. సమతా సైనిక్‌దళ్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం అక్కడి నుంచి పురాతన ఆది బౌద్ధ స్థూపం వరకు ఊరేగింపు జరిగింది. బుద్ధ విహార్ ప్రాంగణంలో పూజ్యభంతే పతాకాన్ని ఆవిష్కరించారు. దివ్య బౌద్ధ స్థూపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి, పీఎస్ఎన్ మూర్తి, మట్టా వెంకటరావు, భయ్య మోహన్, పినిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాల పంపిణీ

రావులపాలెం: మండలంలోని రావులపాడు కాల్వ గట్టున గుడారాల్లో నివాసం ఉంటున్న వలస కూలీ చిన్నారులకు హైదరాబాదుకు చెందిన శక్తి గ్రూప్ చైర్మన్ సుజాత మనోహర్ పుట్టినరోజు సందర్భంగా 50 మంది చిన్నారులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే 100 మంది పేదలకు భోజన పొట్లాలను, ఎనర్జీ డ్రింక్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నపూర్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నూతన కార్యవర్గం

మలికిపురం: భారత విద్యార్థి పరిషత్ స్టూడెంట్ యూనియన్ నూతన కార్యవర్గం ఎంపిక శనివారం మలికిపురంలో జరిగింది. స్థానిక కళాశాల ప్రెసిడెంట్‌గా మేడిచర్ల సుభాష్, వైస్ ప్రెసిడెంట్‌గా పామర్తి అప్పాజీ, మలికిపురం మండల అధ్యక్షుడిగా రాపాక హిమచందు, సఖినేటిపల్లి మండలం అధ్యక్షుడిగా అవనిగడ్డ సాయిరామ్ లను ఎన్నుకున్నారు. రాజోలు నియోజకవర్గం ఏబీవీపీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ కమిటీలను ఎన్నుకున్నారు. గణేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాటంలో ఏబీవీపీ ముందుందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మణికంఠ, మేడిచర్ల హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

అంబాజీపేట: రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించారని సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బేబిరాణి, వైస్ ఎంపీపీ నాగరాజులు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. రోగులకు ఏమైనా సమస్యలుంటే వాటిని యాప్‌లో నమోదు చేసి టోకెన్ ఇస్తారన్నారు. గ్రామంలో నిర్వహించే మెగా వైద్య శిబిరంలో అన్ని రకాల రోగాలకు ప్రత్యేక వైద్య నిపుణులు వస్తారన్నారు. కార్యక్రమంలో లూటికుర్తి శ్రీనివాసరావు, వారచిట్టిబాబు, ఎఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికీ భక్తులు పోటెత్తారు.

జాన్‌కు బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు



బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న జాన్

పి.గన్నవరం: కాకినాడ జేఎన్టీయూలో శనివారం జరిగిన క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఇండియా నాలుగో వార్షికోత్సవం సందర్భంగా న్యాయమూర్తి వసంత కుమార్ చేతుల మీదుగా బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు అందజేశారు. సంస్థ ఫౌండర్ జి.పాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో జాన్‌ను ఘనంగా సత్కరించారు. బెస్ట్ సర్వీస్ అవార్డును అందుకున్న జాన్‌ను పలువురు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మామిడికుదురు: నగరంలో క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఏడుగురు లబ్ధిదారులకు రూ.8.30 లక్షల చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. పెదపట్నంలంకకు చెందిన నలుగురికి, పెదపట్నం, మొగలికుదురు గ్రామాలకు చెందిన ఒక్కొక్కరికి చెక్కులు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్సలు అందించడంతో పాటు దాని పరిధిలోకి రాని వ్యాధులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందజేస్తున్న ఘనత జగన్ సర్కారుకే దక్కుతుందన్నారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలకు అండగా నిలవాలని చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొమ్ముల సూరిబాబు, రాయుడు ఆనంద్, విప్పర్తి నాగేశ్వరరావు, కడి శ్రీను, బండారు బాబులు, లంకే ఏసుబాబు, గిడుగు శ్రీరాములు, కొమ్ముల ధర్మారావు, పేరాబత్తుల నరసింహారావు, కుంపట్ల ఆదినారాయణ పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

నిత్యాన్నదానానికి రూ.22 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు రాజోలు మండల పొన్నమండకు చెందిన దడాల గంగారావు, పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దడాల వెంకటేశ్వర్లు, వరలక్ష్మి దంపతులు శనివారం రూ.22 వేల విరాళం అందించారు. ఏటా మహాలయ అమావాస్య రోజు వారి పేరిట అన్న దానం నిర్వహించేందుకు ఈ విరాళం అందించారని ఆలయ ఈఓ జి.శ్రీదేవి, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. విరాళం అందించిన దాతకు ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, ఉప ప్రధానార్చకుడు మద్దాలి తిరుమలశింగరాచార్యులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టు బోర్డు సభ్యులు

గోపాలమిత్ర కుటుంబానికి ఆర్థిక సాయం

అంబాజీపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోపాలమిత్ర నవుండ్రు శివశంకర్ కుటుంబానికి పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమకూర్చిన ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. అతడి స్వగృహమైన వాకలగరువులో శంకర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలోని పశుసంవర్ధక శాఖ అధికారులు, ఉద్యోగులు, సహాయకులు, గోపాలమిత్రలు సమకూర్చిన రూ.1.26 లక్షల నగదును శివశంకర్ భార్య శ్యామలకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.వెంకటరావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు విజయలక్ష్మి, ఎల్.అనిత, మండల పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్, జిల్లా గోపాలమిత్ర అధ్యక్షుడు రత్నంరాజు, ఉందుర్తి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాకలగరువులో శంకర్ కుటుంబ సభ్యులకు సాయాన్ని అందజేస్తున్న పశువైద్య సిబ్బంది

ఉత్తమ సేవలకు పురస్కారాల ప్రదానం



కాకినాడలో నిర్వాహకుల నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రభావతి



కాకినాడలో ఖాజామొహిద్దీన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, శేషారెడ్డి

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకకు చెందిన ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాజోలు క్లస్టర్ కో ఆర్డినేటర్, స్థానిక ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ గుండేపల్లి ప్రభావతికి శనివారం కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆచార్య దేవోభవ పురస్కారం అందజేసింది. వివరాలను ఆమె స్థానిక మీడియాకు తెలిపింది. ఈ మేరకు కాకినాడ సూర్యకళా మందిరంలో జరిగిన సంస్థ సభ్యుల ఆత్మీయ సమావేశంలో టీచర్ ప్రభావతికి పై పురస్కారం నిర్వాహకులు అందజేశారు. విద్యారంగంలో విశిష్ట సేవలకు, సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపునిస్తూ పై పురస్కారానికి ఆమెను చేయూత సంస్థ ఎంపిక చేసింది. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవికుమార్, ఆదిత్య శేషారెడ్డి, ఎమ్మెల్సీ పద్మజ, కోనసీమ జిల్లా డీఎస్‌వో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొత్తపేట: ఉపాధ్యాయుడు, జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజామొహిద్దీన్‌ను 'చేయూత' సంస్థ ఉత్తమ సేవా పురస్కారంతో సత్కరించింది. కాకినాడలో శనివారం చేయూత సభ్యుల ఆత్మీయ సమావేశం, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వ్యక్తులకు ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపేట మండలం అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఖాజామొహిద్దీన్‌ను ఉత్తమ సోషల్ వర్కర్‌గా గుర్తించి ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి తదితర ప్రముఖుల చేతుల మీదుగా 'ఉత్తమ సేవా పురస్కారం' అందజేశారు. ఖాజామొహిద్దీన్‌ను స్థానిక కళాసాహితీ అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవరాజు, ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు, సభ్యులు ఏడిద సత్తిరాజు, షేక్ గౌస్, ఏబీసీ దేవ్, వులుసు సుబ్బారావు తదితరులు అభినందించారు.

శస్త్రచికిత్సకు సాయం

రావులపాలెం: ప్రమాదంలో తలకి గాయమైన వ్యక్తికి శస్త్ర చికిత్స కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేలు నగదు సాయం అందజేశారు. కాకినాడకి చెందిన దున్నా వీరబాబు గతంలో వెల్డింగ్ పని చేస్తుండేవాడు. రెండు సంవత్సరాల క్రితం బిల్డింగ్ మీద నుంచి పడిపోవడంతో అతని తలకి సర్జరీ చేశారు. కానీ పూర్తిగా కోలుకోలేదు. తరచుగా ఫిట్స్ వస్తున్నాయి. మళ్లీ ఇంకో సర్జరీ చేయకపోతే ప్రాణాపాయం అని డాక్టర్లు చెప్పారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న వీరు కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ సభ్యులను వైద్యానికి సహాయం కోరారు. దీంతో శనివారం రావులపాలెంలో వీరబాబు తల్లి ఆదిలక్ష్మికి సంస్థ తరపున రూ.12 వేలు నగదు సాయాన్ని అందజేశారు.



ఆదిలక్ష్మికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు